# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-02-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ శాసన సభా సమావేశాల్లో భాగంగా ఈ రోజు శాసన సభ, శాసన మండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది.**

2. **ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్) పథకంలో ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఇచ్చే సాయాన్ని 2 లక్షల 39 వేల రూపాయలు మేర చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గం నిర్ణయించింది.**

3. **తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈరోజు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమవుతారు.**

4. **మహా శివరాత్రి సందర్భంగా ఆలయాలు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ శాసన సభా సమావేశాల్లో భాగంగా ఈ రోజు శాసన సభ, శాసన మండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. ఉదయం 9 గంటలకు శాసన సభ సమావేశాలు ప్రారంభం అయిన అనంతరం తొలుత ప్రశ్నోత్తరాల కింద సభ్యులడిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇవ్వనున్నారు. అనంతరం జీరో అవర్ కొనసాగనుంది. శాసన మండలి ఉదయం 10 గంటలకు ప్రారంభం అయిన అనంతరం ప్రశోత్తరాలు, ప్రత్యేక ప్రసావన కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు.

-------------------------

ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్) పథకంలో ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఇచ్చే సాయాన్ని 2 లక్షల 39 వేల రూపాయలు మేర చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గం నిర్ణయించింది. సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిన్న మంత్రి వర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 24 అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కుటుంబంలో ఒకరికైనా ఏఐ శిక్షణ ఇవ్వాలనే లక్ష్యంతో ఏపీ ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. తిరుపతిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీ క్యాంపస్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో డిజాస్టర్ రికవరీ సెంటర్ ఏర్పాటు ప్రతిపాదనకు ఆమోదం లభించింది. పలు సంస్థలకు భూకేటాయింపులు తదితర అంశాలకు

మంత్రివర్గం ఈ సమావేశంలో ఆమోదముద్ర వేసింది.

---------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఢిల్లీ లో పర్యటిస్తున్నారు. పలువురు కేంద్ర మంత్రులతో ఈ రోజు సమావేశం అయ్యి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు, కృష్ణా–గోదావరి నీటి మళ్లింపు ప్రాజెక్టుల పురోగతి, తదితర అంశాలపై చర్చించనున్నారని అధికారులు తెలిపారు. ఏఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గేను ఆయన నిన్న కలిసి రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులను చర్చించారని పేర్కొన్నారు.

---------------------------

శివరాత్రి సందర్భంగా ఆలయాలు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ పంపిణీ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్లతో ఆయన నిన్న శ్రవణ మాధ్యమ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రధాన శివాలయాలు, ఇతర ఆలయాల్లో జరిగే కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున నిరంతరం విద్యుత్ సరఫరాను కొనసాగించాలన్నారు. అనుకోని సమస్యలు తలెత్తకుండా ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పంపిణీ లైన్లను ముందస్తుగా తనిఖీలు చేపట్టాలని సూచించారు.

---------------------------

వందేమాతరం గీతం రచించి 150 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ఆధ్వర్యంలో వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్–2026 రెండో ఎడిషన్ లో భాగంగా 'సురక్షిత తీరాలు – సంవృద్ధ భారత్' అనే నినాదంతో కొనసాగుతున్న సైకిల్ యాత్ర నిన్న తిరుపతి జిల్లా సూళ్ళూరుపేటకు చేరుకుంది. విద్యార్థులు, యువతలో దేశభక్తిని పెంపొందించి, యువతను భద్రతా దళాల్లో చేరేలా ప్రోత్సహిస్తున్నామని సిఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ మదుసూధన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్…27 సెకన్లు

---------------------------

సవాళ్లను అధిగమిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడానికి కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యలకు శాసన సభలో గవర్నర్ ప్రసంగం అద్దంపట్టిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఉభయ సభల సభ్యులనుద్దేశించి రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగంలో ప్రతి పదంలో రాష్ట్ర ప్రజల ఉజ్వల భవిత పట్ల కూటమి ప్రభుత్వం యొక్క నిబద్ధత ప్రతిబింబించిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాణ్యమైన మానవ వనరుల అభివృద్ధికి అత్యంత కీలకమైన ఆరోగ్య రంగంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక మార్పుల్ని సవివరంగా వెల్లడించారని చెప్పారు.

---------------------------

రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ లో రాజమహేంద్రవరం నగరంలో వాహనాల రాకపోకలకు సంబంధించి సమగ్ర రూట్ మ్యాప్ రూపొందించాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి

చేకూరి అధికారులను ఆదేశించారు. నగరంలోకి వివిధ ప్రాంతాల నుండి వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్ సౌకర్యాల ఏర్పాట్లను ఆమె నిన్న క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అదేవిధంగా మహాశివరాత్రి సందర్భంగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఘాట్ల వద్ద అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ...

వాయిస్..25 సెకన్లు

---------------------------

తెలంగాణ రాజధాని గ్రేటర్ హైదరాబాద్ నగరపాలక సంస్థ పరిధిని మూడు నగరపాలక సంస్థలుగా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. సైబరాబాద్ నగరపాలక సంస్థ, మల్కాజ్‌గిరి నగరపాలక సంస్థ, గ్రేటర్ హైదరాబాద్ నగరపాలక సంస్థగా విభజించింది. ఆ వెంటనే కార్పొరేషన్లకు కమిషనర్ల నియామకం, మూడింటికీ ప్రత్యేక అధికారి నియామకం, పరిపాలన వ్యవహారాలకు సంబంధించిన పలు ఉత్తర్వులను విడుదల చేసింది.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్, యానంలలో దిగువ ట్రోపో ఆవరణములో ఉత్తర, ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా కోస్తా ఆంధ్ర, యానాం, రాయలసీమల్లో ఈరోజు పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉందని వాతావరణ కేంద్ర అధికారి బి.శేఖర్ తెలిపారు. ఉత్తర కోస్తా, యానాం, రాలయసీమల్లో అక్కడక్కడా కనిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ వరకూ తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒకటి రెండు చోట్ల పొగమంచు కురిసే అవకాశం ఉందన్నారు.

తెలంగాణలో రానున్న 5 రోజుల పాటు పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఆదిలాబాద్, కామారెడ్డి, కొమరంభీమ్, మంచిర్యాల, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 11 నుంచి 15 డిగ్రీల సెల్సియస్ లోపు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.

---------------------------

ఐసిసి టీ20 ప్రపంచకప్‌లో భాగంగా గ్రూప్ ఎ లో రెండవ లీగ్ మ్యాచ్ లో భారత్ జట్టు ఈ రోజు నమీబియాతో తల పడనుంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఈ రాత్రి 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. తొలి లీగ్ మ్యాచ్ లో నమీబియా, నెదర్లాండ్స్ చేతిలో ఓటమి పాలవ్వగా, భారత్ జట్టు అమెరికాపై విజయం సాధించింది.

---------------------------

దేశాభివృద్ధికి కీలకమైన వస్తు ఉత్పాదక శక్తిని పెంపొందించే ఉద్దేశ్యంతో ఈరోజు జాతీయ ఉత్పాదకత దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. 1958వ సంవత్సరం ఫిబ్రవరి 12వ తేదీన జాతీయ ఉత్పాదకత మండలి ఏర్పాటైన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఇదే రోజు ఈ కార్యక్రమం జరుగుతోంది. ఉత్పాదకత సామర్థ్యాన్ని ..., వస్తు నాణ్యతా స్పృహను పెంపొందించడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ప్రధాన ఉద్దేశ్యం. దేశ ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలలో వృద్ధిని ప్రోత్సహించేందుకు జాతీయ ఉత్పాదకత మండలి ఏర్పాటైంది. "ఆలోచనల నుండి ప్రభావం చేసే వరకు ..., స్టార్ట్ అప్‌ల కోసం మేధో సంపత్తిని రక్షించడం" అన్న ఇతివృత్తంతో ఈ ఏడాది జాతీయ ఉత్పాదకత దినోత్సవం నిర్వహిస్తున్నారు.

---------------------------

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో 73.01 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఏడు నగరపాలక సంస్థల్లో 66.05 శాతం, 116 పురపాలక సంఘాల్లో 75.88 శాతం మేర పోలింగ్ నమోదైందని పేర్కొన్నారు. చౌటుప్పల్‌లో అత్యధికంగా 91.91 శాతం, నందికొండ మున్సిపాలిటీలో అత్యల్పంగా 59.68 శాతం మేర పోలింగ్ నమోదైందని తెలిపారు.

========================